క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

గుడ్లూరు: మండలంలోని చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు బొద్దుకూరు నారాయణరావు తెలిపారు. నెల్లూరు మోడరన్ ఐ వైద్యశాల వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు. శిబిరాన్ని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రారంభిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాలకొండ ఆదాయం రూ.8,85,200

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి ఎలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.8,85,200 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.21,760, తలనీలాలు రూ.43,150, ప్రత్యేక దర్శనం రూ.2,04,900, లడ్డుప్రసాదాలు రూ.2,05,360, అన్నదానం రూ.3,46,840, రూమ్‌అద్దెలు రూ.33,170 వచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: 11కేవీ వీబీపీ ఫీడర్ పరిధిలో లైన్‌కు తగులుతున్న చెట్లను తొలగించే కార్యక్రమంలో భాగంగా నేడు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ నరసింహం తెలిపారు. పట్టణంలోని తూర్పువడ్డెపాలెం, తూర్పు సాలీపాలెం, మారెమ్మమిట్ట, లింగయ్యనాయుడు ఇంటి ఏరియా, కోటారెడ్డినగర్, క్లబ్ రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, పీఈటీ

కనిగిరి రూరల్: జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు కనిగిరి జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు. వీరు అక్టోబర్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జిల్లా తరఫున ఆడనున్నారు. అలాగే మండలస్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపికలు దిరిశవంచ ఉన్నత పాఠశాలలో జరిగాయి. అండర్ 17 విభాగంలో కబడ్డీకి నల్గురు, త్రోబాల్‌కు ఐదుగురు, టెన్నికాయిట్‌కి ఇద్దరు విద్యార్థినులు ఎంపికై నట్లు తెలిపారు. ఎంపికై న విద్యార్థినులను హెచ్ఎం కె.విజయలక్ష్మి, పీఈటీ పి.సుశీల, ఉపాధ్యాయులు అభినందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

జరుగుమల్లి: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని తహసీల్దార్ ఎస్.ఉషారాణి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పైడిపాడు అంగనువాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం ప్రాధాన్యంపై శనివారం ఆమె అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూపర్‌వైజర్ విజయ్ రూత్ అన్నారు. వైఎస్సార్ పోషణ కిట్లలోని రాగి, సజ్జ, జొన్న పిండి, బెల్లం, ఖర్జూరాలు, వేరు శనగ చిక్కీలు, గుడ్లు, పాలు, బాలామృతం ఆహారం తీసుకోవాలన్నారు.

సచివాలయం తనిఖీ

హనుమంతునిపాడు: మండలంలోని హాజీపురం పంచాయతీలోని సచివాలయాన్ని ఎంపీడీఓ కె.లలిత శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా సిబ్బంది హాజరు రికార్డు, విధి నిర్వహణ రికార్డులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ విస్తరణ అధికారి షేక్ షరీఫ్, కార్యదర్శి సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ఓజోన్ డే ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

టంగుటూరు: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రాధానోపాధ్యాయుడు ఆదినారాయణ అన్నారు. మండలంలోని మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓజోన్ డే నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మట్టి వినాయకులను పూజించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, మొక్కలు బాగా పెంచాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా వికాసం కలిగి ఉండాలి



పామూరు: కబడ్డీలో విజేతలుగా నిలిచిన కంబాలదిన్నె బాలికల జట్టు



పొన్నలూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు

పొన్నలూరు: ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడా వికాసం కలిగి ఉండాలని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొని పరుగు పందెం, లాంగ్ జంప్, హై జంప్, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షటిల్ పోటీల్లో తమ ప్రతిభ చూపించారు. జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేక క్రీడా పోటీలతో విద్యార్థుల్లోని నైపుణ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, ఎంపీడీఓ కల్పన, ఎంఈఓలు రవిచంద్రబాబు, హరిబాబు, ముక్కమూరి వెంకటేశ్వర్లు, కొండపి విశ్వేశ్వరరావు, హెచ్ఎం వెంకట్రావు, పీడీ చిరంజీవిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామూరులో

పామూరు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన పోటీల్లో కబడ్డీ అండర్-14, 17 విభాగాల్లో జెడ్పీహెచ్ఎస్ కంబాలదిన్నె, జీహెచ్ఎస్ పామూరు విద్యార్థులు సత్తా చాటి నియోజకవర్గ పోటీల్లో పాల్గొనే మండలజట్టుకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా శనివారం కంభాలదిన్నె జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం పి.మహబూబ్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, వారికి శిక్షణనిచ్చిన పాఠశాల పీడీ ఎం నరసింహారావును అభినందించారు. బాలికల అండర్14, అండర్17 విభాగంలో కంబాలదిన్నె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు సత్తాచాటగా, బాలుర విభాగంలో అండర్14, అండర్ 17 విభాగంలో జెడ్పీహెచ్ఎస్ కంబాలదిన్నె, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పామూరు విద్యార్థులు సత్తా చాటి మండల జట్టుకు ఎన్నికయ్యారు. సిద్ధమూర్తి లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి



పామూరులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సురేష్ యాదవ్



పాకల బీచ్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీరామ్

పామూరు: వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ కాటూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోదలచినవారు అనుమతులు పొందాలన్నారు. కమిటీ సభ్యుల వివరాలు పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. నిమజ్జన ప్రాంత వివరాలు ముందుగానే తెలియజేయాలని సూచించారు. వినాయక మండపాలవద్ద పేలుడు పదార్థాలను ఉంచరాదని, ఫైర్, విద్యుత్ శాఖల అనుమతులు పొందాలన్నారు. ఆయన వెంట ఎస్సై కే.సురేష్‌యాదవ్ ఉన్నారు.

కందుకూరు: వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పట్టణ ఎస్సై హనీఫ్ శనివారం తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు మున్సిపల్, విద్యుత్‌శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని, అనంతరం పోలీస్ వారి అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా విగ్రహాలు ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో వినాయకచవితి పండుగను జరుపుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు.

నిమజ్జనాలకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం

సింగరాయకొండ: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వినాయక నిమజ్జనాలకు పాకల బీచ్‌కు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఎస్ఐ టి.శ్రీరామ్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం సాయంత్రం బీచ్‌ను పరిశీలించారు. పాకల పల్లెపాలెం వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లపోతు గోవర్ధన్‌తో ఎస్ఐ మాట్లాడారు. గ్రామస్తులు మాట్లాడుతూ నిమజ్జనానికి కందుకూరు, కనిగిరి, కొండపి వంటి దూరప్రాంత మండలాల నుంచి విగ్రహాలు వస్తాయన్నారు. పల్లెపాలెం గ్రామస్తులకు, మెరైన్ పోలీసులకు నిమజ్జనాల సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఎటువంటి చర్యలు చేపట్టాలో ఎస్ఐ వివరించారు. మెరైన్ ఎస్ఐ షేక్ షరీఫ్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ లింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు చీదెళ్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా శనివారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లో పంపిణీ చేశారు. రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలతో పర్యావరణానికి హానీ జరుగుతుందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణానికి మేలు చేయాలన్నారు. గత కొన్నేళ్లుగా చీదెళ్ల వేణుగోపాల్ మట్టి విగ్రహాలను పంచుతూ సమాజానికి మేలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పబ్బిశెట్టి శివ, మీడియా చైర్మన్ చెక్కా కేశవరావు, ప్రధాన కార్యదర్శి కోటా నరసింహం, మాజీ కౌన్సిలర్ చీదెళ్ల పిచ్చయ్య, వాసవీ సేవాదళ్ అదనపు ప్రధానకార్యదర్శి మురారిశెట్టి సుధీర్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కనుమర్లపూడి మురళి, గుర్రం అల్లూరయ్య, తుమ్మపూడి సుబ్బయ్య, నల్లమల్లి శేషు, నల్లమల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

విశ్రాంత కలెక్టర్ విజయ్‌కుమార్‌ను కలిసిన గఫార్

- 18న కనిగిరిలో ఐక్యతా విజయ పథం పాదయాత్ర

కనిగిరి రూరల్: విశ్రాంత ఐఏఎస్ విజయ్‌కుమార్ కనిగిరికి వచ్చిన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ శనివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ 'ఐక్యతా విజయ పథం' పేరుతో విజయ్‌కుమార్ పాదయాత్ర చేపట్టడాన్ని కొనియాడారు. ఇప్పటికి ఈ యాత్ర 650 కిలోమీటర్లు పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు పాదయాత్ర సోమవారం కనిగిరి పట్టణానికి చేరుకుంటుందని తెలిపారు. 18న సోమవారం సాయంత్రం 4 గంటలకు కనిగిరి డిపో సెంటర్ నుంచి పామూరు బస్టాండ్ వరకు ర్యాలీ, అనంతరం పామూరు బస్టాండ్ సెంటర్లో సాయంత్రం 5 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సభ అనంతరం పట్టణంలోని ఒంగోలు బస్టాండ్‌లోని షాదీఖానాలో సాయంత్రం 6 గంటలకు జరిగే ముస్లింలతో ఆత్మీయ సమావేశంలో విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడుతారన్నారు. పామూరు బస్టాండ్‌లో జరిగే సభకు, షాదీఖానాలో జరిగే ఆత్మీయ సదస్సుకు ప్రజలు, ప్రజా స్వామిక వాదులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. చైర్మన్ వెంట విజేత విద్యా సంస్థల అధినేత పసుపులేటి అరుణోదర్ తదితరులున్నారు.

చెరువులకు నీటి పైపుల ఏర్పాటుకు ఇబ్బంది లేదు



రైల్వే లైన్‌ను పరిశీలిస్తున్న రైల్వే, ఇరిగేషన్ శాఖాధికారులు

మద్దిపూడి: పాదిలి చిన చెరువు నుంచి మద్రిపూడి చెరువుకు తాగు, సాగునీటి పైపులు నిర్మించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయకుమార్ తెలిపారు. నడికుడి-కాళహస్తి వరకు నూతనంగా రైల్వేలైన్ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. రైల్వేలైన్ మద్రిపూడి మండలం గుండ్లసముద్రం పొలాల్లో నుంచి వెళ్తోంది. పాదిలి చిన చెరువు నుంచి మద్రిపూడి మండలం గుండ్లసముద్రం, మద్రిపూడి ఇరిగేషన్ చెరువులకు ఏర్పాటు చేయనున్న తాగు, సాగునీటి పైపులైన్‌కు రైల్వేట్రాక్ అడ్డు వస్తుందని, అండర్ పైపులైన్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఎంపీపీల సంఘ జిల్లా అధ్యక్షుడు, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి రైల్వే అధికారులకు విన్నవించారు. ఇరిగేషన్, రైల్వే అధికారులు సంయుక్తంగా మండలంలోని గుండ్లసముద్రం శివారులోని రైల్వేలైన్‌ను శనివారం ప్రాథమికంగా పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, రైల్వేసీనియర్ సెక్షన్ ఇంజినీర్ జగదీష్, ఇరిగేషన్ ఏఈ రవికూమార్ ఉన్నారు.

రాయితీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వలేటివారిపాలెం: రాయితీపై మినుము విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే విత్తనాలు ఇస్తామన్నారు. రెండున్నర ఎకరా పొలం పరిధిలోకి తీసుకొని 20 కేజీల మినుములు ఇస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం రైతు పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డు లింక్ ఉన్న మొబైల్ తీసుకొని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

రూ.35 లక్షలతో పైపులైన్‌కు శంకుస్థాపన



జలజీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న ఏఈ కిషోర్, నాయకులు

సింగరాయకొండ: మండలంలోని పాకల పంచాయతీలో సుమారు రూ.35 లక్షల అంచనా వ్యయంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో జలజీవన్ మిషన్ పథకం కింద నిర్మించే పైపులైను నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద పాకల గ్రామంలో సుమారు రూ.60 లక్షలతో పైపు లైను పనులు చేపట్టామని, రెండు వర్కులుగా విభజించి చేస్తున్నట్లు చెప్పారు. ఒక వర్క్ రూ.35 లక్షలతో పాకల గ్రామంలో, మరొక వర్క్ పోతయ్యగారి పట్టపుపాలెం, క్రాంతినగర్‌లో జరుగుతుందని వివరించారు. పంచాయతీ కార్యదర్శి షేక్ సుభానీ, కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్ రెడ్డి, ఏపూరి శ్రీను, కొండూరి అంకయ్య, గ్రామ సచివాలయ కన్వీనర్లు వాయల తాతయ్య, గొల్లపోతు గోవర్ధన్, బుజ్జమ్మ, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

నర్సరీ సాగు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



నర్సరీని తనిఖీ చేస్తున్న ప్రత్యూష

జరుగుమల్లి: మండలంలోని చతుకుపాడులో మిరప నారు సాగు చేస్తున్న నర్సరీని ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సరీ యజమానులు నర్సరీకి చెందిన రిజిస్ట్రేషన్లు సక్రమంగా నమోదు చేయాలన్నారు. రిజిస్టర్ నమోదు చేయని వారికి నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. నర్సరీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రంగా ఉంటే చీడ పీడలు నివారించవచ్చన్నారు. రైతులకు నాణ్యమైన నారు అందించాలన్నారు. నారు విక్రయించేటప్పుడు తప్పని సరిగా రసీదులు తీసుకోవాలని రైతులకు సూచించారు. నర్సరీ పేరు కనిపించేలా ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మొక్కల ధరలు కూడా పట్టికలో సూచించాలన్నారు. నర్సరీలో యాజమాన్య పద్ధతులు రికార్డు చేయాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష హెచ్చరించారు.

నాగూర్‌వలి సేవలు మరువలేనివి

- ఎంపీపీ వాకా వెంకటరెడ్డి



నాగూర్‌వలిని సన్మానిస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, అధికారులు

మద్రిపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ఎస్‌కే నాగూర్‌వలి సేవలు మరువలేనివని ఎంపీపీల సంఘ జిల్లా అధ్యక్షుడు, మద్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి కొనియాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఈఓఆర్డీగా పదోన్నతిపై నెల్లూరు జిల్లా కోవూరు మండలానికి బదిలీపై వెళ్తున్న నాగూర్‌వలికి శనివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ నాగూర్‌వలి ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా పలకరిస్తూ విధి నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సీనియర్ అసిస్టెంట్‌గా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు, ప్రశంసపత్రం అందుకున్నారని గుర్తుచేశారు. అనంతరం నాగూర్‌వలిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మద్రిపూడి, పాదిలి ఎంపీడీఓలు బ్రహ్మయ్య, శ్రీకృష్ణ, ఏఓ ఎస్‌కే ఖాశింపీర, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు భాస్కర్, బోద రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష



వలేటివారిపాలెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్

జరుగుమల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షా కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీడీఓ కె.జలజాక్షి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వావిలేటిపాడు, చింతలపాలెం, నందనవనం గ్రామాల్లోని వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లకు జగనన్న సురక్ష సర్వేపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఆయా గ్రామాల్లోని వలంటీర్లు ఏఎన్ఎంలు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి వాటి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఎంఎల్‌ఓ ఆర్.శివకృష్ణ అన్నారు. జగనన్న సురక్షా కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని కోరారు. సీహెచ్ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వెలిగండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తాతపూడి సుకుమార్ అన్నారు. మండలంలోని రామగోపాలపురంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి పథకం గురించి అవగాహన కల్పించాలన్నారు. అన్ని వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వలేటివారిపాలెం: ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ అన్నారు. మండలంలోని చుండిలో సర్పంచ్ ఇరువని సతీష్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చుండి ఎంపీటీసీ చవిడి బోయిన యానదయ్య, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మణిదీపిక, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

వినాయక చవితికి ముస్తాబవుతున్న గణనాథులు



పొన్నలూరులో వివిధ ఆకారాల్లో ఉన్న వినాయక ప్రతిమలు

పొన్నలూరు: వినాయకచవితి పండగను పురష్కరించుకుని పొన్నలూరులో రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు వినాయక విగ్రహలను తయారు చేసి తుదిమెరుగులు దిద్దుతున్నారు. గతంలో విగ్రహల కోసం మండల ప్రజలు కందుకూరు ప్రాంతానికి వెళ్లేవారు. ఈ ఏడాది పొన్నలూరులో తయారు చేసి అనుకూలమైన ధరలకు అందుబాటులో ఉంచడంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పండగకు వారం ముందుగానే విగ్రహాలు కొనుగోలు చేసి బుక్ చేసుకుంటున్నారు. విగ్రహల డిమాండ్‌ను బట్టి ఎక్కువ సంఖ్యలో తయారు చేస్తున్నారు. పండగకు నాలుగు నెలలు ముందుగా వచ్చిన కళాకారులు సుమారుగా 200 విగ్రహాలు తయారు చేశారు. 2 అడుగుల నుంచి 12 అడుగుల వరకు విగ్రహాలు తయారు చేసినట్లు కళాకారులు తెలిపారు. నెమలి, సింహం, శివుడు, బాహుబలి పలు రకాల ఆకారాల్లో వినాయక ప్రతిమలు అందంగా, ఆకర్షణీయంగా తయారు చేశారు. విగ్రహాల సైజు ఆధారంగా రూ.2 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలుకుతున్నాయి. ఈ ఏడాది మంచి డిమాండ్ ఉండటంతో చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చి విగ్రహాలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే విగ్రహాలకు అడ్వాన్సులు ఇచ్చినట్లు తయారీదారులు చెబుతున్నారు.

కర్ర ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేష్

పీసీపల్లి: కర్ర లోడుతో ప్రమాదకరంగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కర్రలోడుతో మెట్లవారిపాలెం నుంచి..పీసీపల్లికి వెళ్తుండగా ఎదురుగా ఇర్లపాడు నుంచి మెట్లవారిపాలెంకు మహేష్, చందులు బైక్ వస్తున్నారు. రాత్రి కావడంతో కర్రలోడు ట్రాక్టర్ ట్రాలీ కనిపించక వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో బైక్‌పై వస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఒకరిని కందుకూరు కోటారెడ్డి ఆస్పత్రి, మరొకరిని ఒంగోలు కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

గ్రామాల్లో అందరికీ ఉచిత వైద్యం



ఆరోగ్య సర్వే టోకెన్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ మాధవరావు

పొన్నలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేపై వైద్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. మాధవరావు మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష వైద్య శిబిరాలను సక్రమంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రత్యేక సర్వే ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. గుర్తించిన వారికి వైద్య శిబిరంలో ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆరోగ్య సర్వే సక్రమంగా చేపట్టాలన్నారు. అనంతరం ఆరోగ్య సర్వే టోకెన్‌ను విడుదల చేశారు. పీహెచ్‌సీ డాక్టర్లు ఉన్నం కీర్తి, కృష్ణచైతన్య, రవికిరణ్ పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి

జరుగుమల్లి: బాలికలు క్రీడల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ అన్నారు. మండలంలోని చిరుకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు గ్రామానికి చెందిన కొత్తపల్లి జాలయ్య రూ.10 వేల విలువ చేసే 30 జతలు క్రీడా దుస్తులు శనివారం పంపిణీ చేశారు. బాలికలు క్రీడలతో పాటు ఉన్నత చదువులు చదివి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జాలయ్య అన్నారు. ఉపాధ్యాయులు, బాల బాలికలు పాల్గొన్నారు.



బాలికలకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న జాలయ్య

తీరం పరిశుభ్రంగా ఉండాలి



తీరంలో శుభ్రం చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ఉలవపాడు: తీరం పరిశుభ్రంగా ఉండాలని రామాయపట్నం మెరైన్ సీఐ కిశోర్‌కుమార్ అన్నారు. ప్రపంచ తీర ప్రాంత పరిశుభ్రతా దినోత్సవాన్ని శనివారం పెదపట్టపుపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తీరంతోపాటు సముద్రం కూడా స్వచ్ఛగా ఉంచాలని తెలిపారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సముద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తీరంలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఎస్సైలు షరీఫ్, ఈశ్వరయ్య, సర్పంచ్ ఆవుల జయరాం, ప్రధానోపాధ్యాయుడు సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.